www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 18 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-152 | పేజీలు - 4 వెల రూ. 5/-


Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# గింత శాడిజం ఎందుకు ?

## రాజగోపాల్‌రెడ్డి అహంకారపు మాటలకు బిత్తరపోయిన బడుగుజీవులు

### ఇల్లు కాలిపోయింది ఆదుకోండి సార్ అని కాళ్లమీద పడి వేడుకున్న నిరుపేద దళిత కుటుంబాన్ని కించపరిచేవిధంగా అవమానించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

### సొంత డబ్బులతో పేదలను ఆదుకుంటున్నానని ప్రగల్భాలు పలికే ఓట్ల దొంగ అసలు స్వరూపం బట్టబయలు



సంవత్సరం క్రితం కాలి బూడిదైన నివాసం (ఫైల్ ఫోటో), సర్వస్వం కోల్పోయి నిరాశ్రేయులైన కుటుంబం



“ రెక్కాడితే కాని డొక్కాడని బడుగు జీవుల బతుకుల్లో ఆ రోజు చీకట్లు అలుముకున్నాయి. ఆ కుటుంబం నివసించే పూరి గుడిసె ప్రమాదవశాత్తు దగ్గమైంది. ఆ సమయంలో ప్రాణనష్టమేమి జరగలేదు కాని కట్టు బట్టలతో బజారున పడిన ఆ కుటుంబం దిక్కుతోచక అప్పటి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దగ్గరకు వెళ్లి విన్నవించుకోగా “డబ్బులు చెట్లకు కాస్తున్నాయా !, నీ ఇల్లు తగలబడితే నన్నేం చెయ్యమంటవు” అంటూ అవహేలన చేశారని ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

తన స్వంత డబ్బులతో ప్రజలను ఆదుకుంటానని ప్రగల్భాలు పలికే రాజగోపాల్‌రెడ్డి అసలు స్వరూపం బయటపడింది. ఫౌండేషన్ పేరుతో చెక్కుల పంపిణీ అంతా ఓట్ల కొనుగోలు కోసమే అని మరోసారి నిరూపితమైంది.

**మూడున్నర సంవత్సరాలలో సుశీల ఫౌండేషన్ ద్వారా అరకొరగా సేవలు, రాజీనామా తరువాత ఫౌండేషన్ పేరుతో చెక్కుల పంపణీ విపరీతం**

2018 ఎన్నికలలో గెలిచిన తరువాత నుంచి ఇటీవల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ముందు రోజు వరకు సుశీల ఫౌండేషన్ ద్వారా ఎన్ని నిధులు మునుగోడు నియోజకవర్గంలో ఖర్చు చేశావు. రాజీనామా చేసిన తరువాత మునుగోడు నియోజకవర్గంలో ఎన్ని నిధులు సుశీల పౌండేషన్ ద్వారా ఖర్చు చేశావు. లెక్కలు బయట పెట్టగలవా రాజగోపాల్‌రెడ్డి. నీ స్వార్ధ రాజకీయల కోసం మునుగోడు నియోజకవర్గంలో చెక్కులను పంచుతూ ఓట్లు రాబట్టు కోవాలని ప్రయత్నం చేస్తున్నావు. ఇదే స్థాయి దాతృత్వం మూడున్నర సంవత్సరాలలో ఎక్కడకు పోయింది నీ ఉదాసీనత. ఇంత విచ్చలవిడిగా చెక్కుల పంపణీ ఎందుకు చేయలేదు. అప్పుడు లేని సేవా దృత్పదం ఇప్పుడు ఎందుకు ఉట్టిపడుతుంది. రాజీనామా తరువాత కట్టలు తెట్టెలుగా చెక్కుల పంపణీ ఎందుకు పంచుతున్నవు. ఇది కేవలం ఓట్ల రాజకీయం కాదా చెప్పు గోపాల్.

**నల్లగొండ, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** రాజగోపాల్‌రెడ్డి అసలు స్వరూపం తెలియక పాపం ఈ బడుగు జీవులు ఆపన్నహస్తం కోసం చేయ్యి చాచారు. తమ ఊరికి ఎమ్మెల్యే వచ్చాడని తెలుసుకోని సాయం అడగగా, నాకే అప్పులైనయి అని చీత్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు రాజగో పాల్‌రెడ్డి. వివరాలలోకి వెళితే మునుగోడు మండలం, ఊకొండి గ్రామ వాసులైన చందపాక లింగస్వామి, భార్య రేణుక. వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మొగపిల్లాడు. భార్యా భర్తలు కూలికి వెళితేనే కాని వారి జీవితం గడవడం కష్టం. అలాంటి నిరుపేద కుటుంబానికి కష్టాలు వెంటాడాయి. ఉన్నట్లుండి వారు నివాసం ఉండే ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా జనవరి 6 2021న దగ్గమైంది. ఆ సందర్భంలో ఊకొండి గ్రామానికి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వచ్చారు. ఇది తెలుసుకున్న లింగస్వామి కుటుంబం రాజగోపాల్‌రెడ్డి దగ్గరకు వెళ్లి ఉన్న విషయాన్ని విన్నవించుకోని కాళ్ల మీద పడి బోరున విలపించారు. తమకున్న 2వ



**రాజగోపాల్ చీప్ ట్రిక్స్**

ఎక్కువ మంది కనబడితే చాలు.. కార్ల నుంచి చెక్కు బుక్కును తెప్పించుకొని చెక్కుల డ్రామా షురూ చేస్తుండు. ఇదంతా చూసిన జనం.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రజలను ఆదుకుంటున్నారు అనుకుంటే పొరపాటే. దీనికో లెక్క ఉంది. సెంటిమెంట్‌తో డబ్బు పంచి, గెలిచిన తరువాత పదవిని తాకట్టు పెట్టి మరోమారు కోట్లు సంపాదించవచ్చని ఎత్తుగడలు వేస్తుండు. ఇయనగారు చెప్పినట్లే డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయా మరి!

# ప్రధాని మోడీకి కెసిఆర్ జన్మదిన శుభాకాంక్షలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** ప్రధాని నరేంద్ర మోదీకి సిఎం కెసిఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగతంగా, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రజల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీకి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం కేసీఆర్ ప్రార్థించారు. దేశానికి ఇంకా చాలా ఏండ్లు సేవ చేసేలా ఆరోగ్యంగా ఉండాలని కేసీఆర్ ప్రార్థించారు. ఈ మేరకు లేఖ ద్వారా శుభాకాంక్షలు పంపారు.

# దేశానికి, తెలంగాణకు కాంగ్రెస్‌తోనే స్వాతంత్ర్యం

- సర్దార్ పటేల్‌తోనే హైదరాబాద్‌కు విముక్తి
- సాయుధ పోరాట సమయంలో బిజెపి ఎక్కడుంది
- ఎనిమిదేళ్లుగా కెసిఆర్ ఎందుకు వేడుకలు నిర్వహించలేదు
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరించిన పిసిసి చీఫ్ రేవంత్
- తెలంగాణ తల్లి విగ్రహ నమూనా ఆవిష్కరణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** దేశంతో పాటు రాష్ట్రానికి స్వాతంత్ర్యం తీసుకునివచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇవాళ కొందరు చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ కారణంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని రేవంత్ అన్నారు. స్వాతంత్ర్య సాయుధ పోరాట సమయానికి భాజపా అసలు పుట్టలేదని పేర్కొన్నారు. స్వార్థ రాజకీయాల కోసమే విమోచన దినోత్సవాలు నిర్వహిస్తున్నారని ఆయన బిజెపిపై మండిపడ్డారు.రెడ్డిరాజకీయ కోణంలోనే విమోచన దినోత్సవాలు నిర్వహిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ 2వ

# దేశంలో మతోన్మాద శక్తుల విచ్ఛిన్నకర ధోరణులు

## అప్రమత్తంగా లేకుంటే మనమంతా ఆగం అయిపోతాం

- ఏ మాత్రం ఏమరుపాటు వహించినా తెలంగాణ అల్లకల్లోలం
- అభివృద్ధిలో దూసుకుపోతున్న మనం అంధకారంలో పడరాదు
- తెలంగాణ ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధితో సాగుతున్నాం
- కొంత నిర్లక్ష్యం కారణంగా 56 ఏళ్లు ఉమ్మడి పాలనలో మగ్గాం
- అన్ని ప్రాంతాల మాదిరే హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనం
- పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు
- జెండా ఆవిష్కరించి ప్రసంగించిన సిఎం కెసిఆర్
- పోడు సమస్యలకుత్వరలోనే పరిష్కారం
- దేశ వ్యాప్తంగాగిరిజనలందరికీ సమాన హోదా
- అందుకోసం పోరాటం చేస్తామన్న కెసిఆర్
- కుమ్రంభీమ్, బంజారా భవన్‌లను ప్రారంభించిన సిఎం



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** దేశంలోనూ, రాష్ట్రంలోనూ మతోన్మాదశక్తులు పేట్రేగి పోతున్నాయని అలాంటి వాటిపట్ల అప్రమత్తంగా 2వ

# పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం

- ఆపరేషన్ పోలోతో విముక్తి కల్పించిన ఉక్కు మనిషి
- విమోజనోత్సవాలను నిర్వహించడంలో ఇంతకాలం రాజకీయం
- కేంద్రం ముందుకు రావడంతో ఇప్పుడు అంతా కదిలారు
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించిన హోంమంత్రి అమిత్‌షా
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు..హాజరైన ఏక్‌నాథ్ షిండే



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** హైదరాబాద్ విమోచనానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్రహోంమత్రి అమిత్ షా అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్‌కు మాత్రం వెంటనే రాలేదన్నారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు.. ఆపరేషన్ పోలో ద్వారా పటేల్ ముగింపు పలికారని అమిత్ షా కొనియాడారు. అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ వల్లే ఇదంతా సాధ్యమైందని అమిత్‌షా పేర్కొన్నారు. ఈ వేడుకలకు కేంద్రం హోంమంత్రి అమిత్‌షా హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన పుస్తకంలో సంతకం చేసి సందేశాన్ని రాశారు. అమరుల స్థూపానికి నివాళుల ర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో కళాకారులు నృత్యాలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రాలంకరణలో ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రాష్ట్ర కళారూపకాల ప్రదర్శనతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు మార్మోగాయి. డప్పుదరువులు, ఒగ్గు కథలతో కళాకారులు హోరెత్తించారు. అమిత్‌షాతో పాటు ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు రావడంతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు పోలీసులు. ఈ వేడుకల్లో 3 రాష్ట్రాలకు చెందిన కళానృత్యాలు ఏర్పాటు చేశారు. ఇక ఈ వేడుకలకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు.



## సంపాదకీయం

# వడ్డించేవాడుంటే..అపర కుబేరలకేం కొదవ ?

వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటి ? అన్న సామెత ఇప్పుడు మన దేశ కుబేరుల్లో ముందు వరసలో ఉన్న ఆదానీకి బాగా సరిపోతుంది. ఎందుకంటే ఆయన చేసే వ్యాపారం కన్నా..అందించే సహకారం వల్లనే ఈ స్థాయికి చేరారని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆసియా కుబేరుడు గౌతమ్ అదానీ సంపదలో మరో మెట్టు ఎక్కడంలో ఆయన వెనక ఎవరున్నారు..ఎవరు సహకారం అందిస్తు న్నారో దేశంలోని సామాన్యులకు కూడా తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న గంగవరం పోర్టు, నెల్లూరులోని పోర్టులు అన్నీ ఆదానీ పరం అయ్యాయి. గంగవరం పోర్టుకోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన జాలర్లు ఆగమయ్యారు. గంగవరం పోర్టుతో పాటు విశాఖ ఉక్కును కూడా మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పేరేట్లకు కట్టబెడుతూ వస్తోంది. ఇలా కట్టబెడితే ఎవరైనా ఆదానికి మించి ఆదాయం సంపాదించగలరు. ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగలరు. ఈ కరాణంగానే ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో ఆదానీ రెండో స్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్ల జాబితా ప్రకారం.. వ్యక్తిగత సంపద 15,570 కోట్ల డాలర్లకు పెరగడంతో అదానీ రెండో స్థానంలో నిలిచారు. అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్, లూయీ విట్టన్ అధిపతి బెర్నార్డ్ అర్నోను సైతం వెనక్కి నెట్టి ఈ స్థానానికి చేరుకున్నారు. టెస్లా కార్ల కంపెనీ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ 27,350 కోట్ల డాలర్ల ఆస్తితో ప్రపంచ నం.1గా కొనసాగుతున్నారు. నిజానికి ప్రపంచంలో ఉన్న కుబేరులంతా కష్టపడి నీతిమంతంగా సంపాదించి, అందులో దేశం కోసం కొంత వెచ్చించి కుబేరులవుతున్నారు. కానీ ఆదానీ, అంబానీలాంటి వారు భారత ప్రజల శ్రమశక్తిని తమ ఖాతాల్లో వేసుకుంటూ కుబేరులవుతున్నారు. ఇలాంటి వారికి మన ప్రధాని మోడీ లాంటి వారి సహకారం పుష్కలంగా ఉండడం కూడా కలసి వస్తోంది. ఇకపోతే భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ 9,160 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ప్రపంచ ర్యాకింగ్స్‌లో 8వ స్థానంలో ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గౌతమ్ అదానీ సంపద 7,240 కోట్ల డాలర్లు పుంజుకుంది. ఈ ఏడాదిలో అత్యధిక సంపద వృద్ధి నమోదు చేసుకున్న ప్రపంచ కుబేరుల్లో అదానీ దే అగ్రస్థానం. అంతేకాదు, ఈ ఏడాది సంపదను మరింత పెంచుకోగలిగిన ప్రపంచ టాప్ టెన్ కుబేరుల్లో అదానీ, అంబానీ లు భారతీయులే కావడం విశేషం. ఇకపోతే మోడీ ప్రధాని అయ్యాక ఈ ఇద్దరికి గతంలో ఎప్పుడూ లభించనంత ప్రోత్సాహం దక్కుతోంది. పెట్రోల్‌పై రూపాయి తగ్గించడానికి, గ్యాస్‌పై రూపాయి తగ్గించడానికి, జీఎస్టీ వవడ్డింపులను కొంతయినా తగ్గించడనాకి ఏ మాత్రం సాహసించని మోడీ ఇలాంటి కుబేరుల కోసం మాత్రం ఎంతైనా చేయడానికి సిద్దంగా ఉన్నారు. ఉచిత పథకాల వలన మనదేశం కూడా శ్రీలంక మాదిరి అవుతుందంటూ అనేక మంది గుండెలు బాదుకుంటున్నారు. నిజానికి అలా ఎందుక య్యిందో ఎవరూ వివరించడం లేదు. శ్రీలంక దెబ్బతినడానికి అసలు కారణం ఏమంటే ధనికులు, కార్పొ రేట్లకు పన్నులు తగ్గించటం మాత్రమే. ఈ విషయాన్ని ప్రచారం చేయకుండా కేవలం ఉచితాలపై మనదేశం లో అతిగా ప్రచారం చేస్తున్నారు. అలాగని ఉచితాలు ఇవ్వాలని ఎవ్వరూ అనడం లేదు. ఎన్నికల తరుణంలో ఓటర్లకు ఉచితాలను అందిస్తామని వాగ్దానాలు చేయకుండా చూసేందుకు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శక సూత్రాలను జారీ చేయాలని బిజెపి నేత, లాయర్ అశ్వనీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ఒక పిటీషన్ దాఖలు చేయడం వెనక మోడీ ఉన్నారని అనుమానించాల్సిందే. ఎందుకంటే కార్పోరేట్లకు ఇచ్చే తాయిలాల్లో ఒక్క శాతం కూడా ఉచితాలకు ఖర్చు కావడం లేదు. దీనిని ఎవరు కూడా చర్చించడం లేదు.. నిజానికి కార్పో రేట్లకు ఉచితాలు ఇవ్వడం, రుణాలు మాఫీ చేయడం, పన్నులు రద్దు చేయడం కూడా లంచంగానే భావించాలి. సామాన్యులకు చేయని సాయం కార్పోరేట్ గద్దలకు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసం. గతంలో కాంగ్రెస్ పాలకులు అనుసరించిన కార్పోరేట్ అనుకూల విధానాలను మరింత వేగంగా అమలు జరుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ కారణంగా సామాన్యులు ఇక్కట్ల పాలవుతున్నారు. అందుకే వారు ప్రపంచ కుబేరులగా జాబితాలో చోటు చేసుకుంటున్నారు. సంపదను దేశ అభివృద్ధికి వినియోగించి ఉంటే ప్రజలకు ఉచితాలు పంచాల్సిన అవసరంలేదు. అలాగే కార్పోరేట్లకు ఇచ్చే రాయితీలు అడ్డుకుంటే ధరలతో ప్రజలు భారం మోయాల్సిన అవసరం రాదు. ఉచితాలు అనుచితాలు, సంస్కరణలు, నూతన విధానాలతో నిమిత్తం లేకుండా పాలన సాగిస్తే భారత ఆర్థిక వ్యవస్థ బలపడేది. ఎక్సైజ్, కార్పొరేట్, వ్యక్తిగత పన్ను రాయితీల వలన ప్రభుత్వం కోల్పోయిన రాబడి లక్షా 95 వేల కోట్ల రూపాయలు. తరువాత అది ఏటేటా పెరుగుతూ నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన 2014 -15లో ఐదు లక్షల 54 వేల కోట్లకు చేరింది. వీటిలో రాష్ట్రాలు ఇచ్చిన భూమి, విద్యుత్, అమ్మకపు పన్ను, ఇతర రాయితీలు లేవు. అవి కూడా వేలు, లక్షల కోట్లలోనే ఉంటాయి. అంటే ఇంత పెద్ద మొత్తాలను ప్రోత్సాహకాల పేరుతో కేంద్రం అప్పనంగా కార్పొరేట్ల కు అప్పగిస్తోంది. ఆ మొత్తం ఖజానాకు చేరివుంటే ప్రజల సంక్షేమానికి లేదా పెట్టుబడుల ద్వారా దేశ సంపదల వృద్ధికి తోడ్పడేది. అందుకే ఆదానీ లాంటి వారు అప్పనంగా ప్రభుత్వ సొమ్ముతో లక్షల కోట్లు వెనకేసుకుంటున్నారు. తమ ప్రభుత్వం వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహం అని గొప్పలు చెప్పుకొనేందుకు, ఇంతేసి మొత్తాలను ఇస్తున్నాం రండి అని విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ప్రకటనలు చేసుకుంది. కొందరి సంపద పెరిగితే ఏడుపు ఎందుకని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. సంపాదించటం చేతకాక అంటారు మరికొందరు. అయితే దేశంలో పేదల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది. కొనుగోలు శక్తి నశిస్తోంది. ధరల పెరుగుదలకు దారి తీసిన కారణాల్లో ప్రధానమైనదిగా చమురుపై సెస్‌ల పెంపుదల ఒకటి. జనానికి ఉపశమనం కలిగించటం కంటే జీఎస్టీల పేరుతో దండు కోవడం ఎంతవరకు సబబు. ఆదానీ, అంబానీ లాంటి వారికి చేస్తున్న ప్రయోజనాలు, పేదలకు దక్కిన వ్యవహారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి తారతమ్యాలపై చర్చించకుండా ఉంటే ఒకరిద్దరు మాత్రమే ఎప్పటికీ ధనవంతులుగా కొనసాగుతారు. ప్రజాస్వామ్యంలో పాలకుల అవినీతి ప్రత్యక్షంగా అయినా పరోక్షంగా అయినా ఎండగట్టాల్సిందే. లేకుంటే దేశ ప్రజలు మూల్యం చెల్లించుకోక తప్పదు.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## గింత శాడిజం ఎందుకు ?

### రాజగోపాల్‌రెడ్డి ఆహంకారపు మాటలకు బిత్తరపోయిన కుటుంబం

(మొదటి పేజీ తరువాయి..)ఇల్లు దగ్గమైందని, కట్టుబట్టలతో మిగిలిన మమ్ములను ఆదుకోవాలని వేడుకున్నా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మనస్సు కరుగలేదు. పైగా ఎటకారపు మాటలతో లింగస్వామి కుటుంబాన్ని బాదపెట్టే విధంగా ప్రవర్తించిన తీరు కోమటిరెడ్డి షాడిజాన్ని తలపించింది. ఆదుకోవడం పక్కనపెడితే నాకే అప్పులైనయి. నీకు ఎక్కడ నుంచి తెచ్చిఇవ్వాలి అని ఆ దళిత కుటుంబాన్ని అవమానించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ కుటుంబానికి ఇల్లు లేదు. ప్రస్తుతం మునుగోడులో అద్దెకు నివాసం ఉంటున్నారు. ఇప్పటికైనా బాధిత లింగస్వామి కుటుంబాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదుకోవాలని కోరుకుందాం. ఇదిలా ఉంటే అప్పటికే మునుగోడు నియోజకవర్గంలో కోమటిరెడ్డి పెన్షన్ బ్యాచ్ కొంత మోపై ఉన్నది. ఆ బ్యాచ్ ఎప్పుడు కోమటిరెడ్డి భజన చేస్తూ గప్పాలు కొడుతూ ఉంటారు. ఆ బ్యాచ్ చెప్పిన వారికి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా అప్పుడప్పుడు చెక్కులను పంపిణీ చేస్తున్నారు. మంచి, చెడుల పేరున పదివేల పైకం పంపుతుంటారు. ఆ ఆనవాయితి మునుగోడు నియోజకవర్గంలో ఈ దొర నుంచే మొదలైంది. రాజగోపాల్‌రెడ్డి పదివేల పంపకం మొదలైన నుంచి.. ఇప్పుడు అన్ని పార్టీల నాయకులు పదివేల కట్నం చదివించుకుంటున్నారు. ఏది ఏమైనా రాజగోపాల్‌రెడ్డి ఎవరికి ఇవ్వాలో... ఎవ్వరికి ఇవ్వోద్దో తెలిసిన ఘనుడు. ఎక్కడ చెక్కులు పంచితే ఓట్లు రాలుతాయో తెలిసిన ఫక్తు రాజకీయ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి. ఇలాంటి నీచపు రాజకీయ నాయకుడిని మునుగోడు నియోజక వర్గ ప్రజలు ఓట్ల రూపంలో బుద్ది చెప్పాలని మునుగోడు ప్రజలు భావిస్తున్నరు.

## దేశానికి, తెలంగాణకు కాంగ్రెస్‌తోనే స్వాతంత్ర్యం




స్వాంతంత్ర్య వజ్రోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయజెండా ఎగురవేసి కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారు. హిందు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి లబ్దిపొందాలని చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇవాళ కొందరు చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. తెలంగాణ అంటేనే కాంగ్రెస్. కమ్యూనిస్టులతో కలిసి భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేశారు. చరిత్రను నేడు కొందరు వక్రీకరిస్తున్నారు. ఆనాడు 563 సంస్థానాలను భారత్‌లో విలీనం చేశారు. హైదరాబాద్ లాగానే గుజరాత్‌లోని జునాఘడ్‌లో వేడుకలు ఎందుకు జరపట్లే దని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. నెహ్రూ ఆదేశాల మేరకే పటేల్ హైదరాబాద్‌ను విలీనం చేశారు. ఎంతో మంది ఉద్యమకారుల వీరోచిత పోరాటమే ఈ స్వేచ్ఛ అని అన్నారు. అమరులు, వీరులను స్మరించుకుంటూ.. వారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బైరాన్‌పల్లి ఘటనలు తెలంగాణలో చాలా జరిగాయని తెలిపారు. ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం దండు కట్టింద్రు.. దళంగా కదిలింద్రు అని గుర్తుచేశారు. ఎనిమిదేళ్లుగా సెప్టెంబర్ 17 ఉత్సవాలు చేయని తెరాస సర్కార్‌కు ఇప్పుడే గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. 1950లో గాంధీ భవన్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ పునాదులు వేశారన్నారు. పటేల్‌కు పూలదండ వేసే నైతిక హక్కు కూడా భాజపాకు లేదని అన్నారు. 'దేశంలో మోదీ సర్కార్ విస్తరించడానికి కుట్రలు చేస్తుంది. కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని దోచిపెడు తుంది. విడగొట్టే పనిలో మీరున్నరు.. కలిపే పనిలో మేమున్నాం. వాట్స్ ఆఫ్ యూనివర్సిటీలో ఓవర్ నైట్ పని చేసి యువతను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇక కేసీఆర్ స్వీయ చరిత్ర, కుటుంబ చరిత్ర రాసుకోవడానికి అసలు చరిత్రను వక్రీకరిస్తున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'టీఎస్'ను 'టీజీ'గా మారుస్తాం. అందెశ్రీ రాసిన పాటను రాష్ట్ర గీతంగా చేస్తాం. కొత్త జెండా రూపుద్దిద్దుకుంటుంది. దానికి యువత, కవులు కళాకారుల మేధావుల ఆలోచనలు పంపాలి. సబ్బండ వర్గాల ప్రజల తల్లిగా తెలంగాణ తల్లిని రూపొందిస్తున్నామని' రేవంత్‌రెడ్డి తెలిపారు. చాకలి ఐలమ్మ వీరత్వం, మల్లు స్వరాజ్యం ధీరత్వం కలగలిపిన విధంగా.. రాష్ట్ర సంస్కృతికి నిలువుటద్దంగా రూపకల్పన చేసినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేయడం లేదని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ప్రదర్శనకు మాత్రమే అక్కడ ఉంచినట్లు తెలిపారు. తెలంగాణ బిడ్డల ఆత్మగౌరవాన్ని ఆకాశానికి ఎగరే విధంగా జెండా రూపొందిస్తా మన్నారు. కేసీఆర్ పెట్టిన కుంపటిని బీజేపీ అందిపుచ్చుకుని మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని రేవంత్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య,గీతారెడ్డి, అంజనీకుమార్,షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మతోన్మాదుల విచ్ఛిన్నకర దోరణులు అప్రమత్తంగా లేకుంటే మనమంతా ఆగమైపోతాం



ఉండాల్సిందేనని ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారు. ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా, తెలంగాణ ఛిద్రం కాగలదని అన్నారు. తమ సంకుచిత ప్రయోజనాల కోసం సామాజిక సంబంధాల నడుమ ముళ్లకంపలు నాటుతున్నాయని,. విద్వేషపు మంటలు రగిలిస్తూ, విష వ్యాఖ్యలతో ఆజ్యం పోస్తున్నాయని అన్నారు. మనుషుల మధ్య ఈ రకమైన విభజన ఏ విధంగానూ సమర్థనీయం కాదని, మతం చిచ్చు విజృంభిస్తే అది దేశం, రాష్ట్రం జీవికనే కబళిస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా సీఎం కేసీఆర్ పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. ఎనిమిదేళ్లలో తెలంగాణ జీవన ముఖచిత్రం ఎంతగానో మారిపోయిందని కేసీఆర్ తెలిపారు. పచ్చని పొలాలతో, చక్కని మౌలిక వసతులతో శాంతికి నెలవుగా తెలంగాణ అలరారుతున్నదన్నారు. తెలంగాణ ఏర్పాటు అన్నది ప్రజల కోరిక మేరకు జరిగిందని, వారు కోరుకున్న విధంగానే సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తూ రాష్ట్రం ప్రగతిబాటలో పయనిస్తున్నదని అన్నారు. మీ అందరి అండదండలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన వ్యక్తిగా, అనునిత్యం తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తిగా, ఈ నేల పై నెలకొన్న శాంతి, సౌభ్రాతృత్వాలను గుండెల నిండా శ్వాసించే వ్యక్తిగా.. ప్రతీ క్షణం ప్రజాశ్రేయస్సు కోసమే పరితపించే వ్యక్తిగా, అన్నింటికి మించి మీ బిడ్డగా ఈ విషయం మీకు చెప్పడం నా కర్తవ్యం. నా గురుతర బాధ్యత అని కేసీఆర్ పేర్కొన్నారు. మీ అందరికీ వినమ్రంగా చేతులు మోడ్చి నమస్కరిస్తూ నేను కోరుకునేది ఒక్కటే.. ఎన్నటికీ ఈ నేల శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలే తప్ప, అశాంతి, అలజడులతో అట్టుడికి పోవద్దు. తిరిగి తెలంగాణ మరో కల్లోలంలోకి జారిపోవద్దు. తెలంగాణ ఇప్పుడు ఎంత వేగంగా పురోగమిస్తున్నదో.. అంతేవేగంతో రాబోయే రోజుల్లోనూ అప్రతిహతంగా అభివృద్ధి పథంలో దూసుకు పోవాలి. జాతినిర్మాణంలో ఉజ్వల పాత్రను నిర్వహించాలి. భారతజాతి జాగృతి కోసం, అభ్యున్నతి కోసం మనవంతు దోహదం చేద్దామని అందరినీ కోరుకుంటూ మరోమారు యావత్ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉంటే.. బంజార భవన్ ప్రారంభ కార్యక్రమంలో పోడు భూముల సమస్యలను త్వరలోనే పరిష్కారం చేసుకోబోతు న్నామని కేసీఆర్ ప్రకటించారు. బంజారా ప్రజాప్రతినిధులంతా యాక్టివ్‌గా ఉండి.. పోడు భూముల పరిష్కారంలో చొరవ తీసుకోవాలన్నారు. మన బిడ్డలకు న్యాయం జరిగేలా చూడాలని మీ అందర్నీ కోరుతున్నాను. అడవులు, తండాల్లో ఉన్న మన బిడ్డలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు వెళ్తున్నారు. వారి బతుకులను బాగు చేసేందుకు ఈ రాష్ట్రంలో జరగాల్సిన చర్చలు ఈ భవనం నుంచి జరగాలని కోరతున్నాను. మన రాష్ట్రంలో గిరిజన బిడ్డలు ఎస్టీలు.. మహారాష్ట్రలో బీసీలు. ఇంకో చోట ఓసీలు కూడా ఉన్నారు. ఇట్ల రకరకాలుగా విభజనలో ఉన్నారు. దేశ వ్యాప్తంగా ఉండే గిరిజన బిడ్డలందరికీ సమాన హోదా వచ్చే కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో నూతనంగా నిర్మించిన సేవాలాల్ బంజారా భవన్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఈ రోజు బంజారాహిల్స్‌లో ఇంత చక్కటి బంజారా భవన్ నిర్మాణం చేసుకోని నాచేతులుతో ప్రారంభింప జేసుకున్నందుకు మంత్రి సత్యవతి రాథోడ్‌కు, బంజారా ప్రజాప్రతినిధులకు, యావత్ తెలంగాణ రాష్ట్ర బంజారా బిడ్డలందరికీ హృదయపూర్వకంగా, సంతోషంగా అభినందనలు తెలియజేస్తున్నాను. తెలంగాణ వస్తే ఏం జరుగుతదనే మాట ఉద్యమ సందర్భంలో చాలా చోట్ల చెప్తూ వచ్చాను. అనేక సందర్భాల్లో కూడా చెప్పాను. మన రాజధాని నగరంలో బంజారాహిల్స్ అనే గొప్ప ప్రాంతం ఉంటది. కానీ బంజారాలకే గజంజాగ లేదని చెప్పాను. ఆ మాట తారుమారు చేస్తూ ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో బంజారా బిడ్డల గౌరవం ఈ జాతి మొత్తానికి తెలిసే విధంగా భవనం నిర్మించుకున్నాం. మనం ఈ రోజు ఈ భవనాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇది భారతదేశ గిరిజన జాతి అందరికీ కూడా ఒక స్ఫూర్తి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మన బాట పట్టాయి. అన్ని చోట్ల గిరిజన బిడ్డలకు గౌరవం లభించే విధంగా దశ దిశ చూపిస్తుందని భావిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.



భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మనం నిర్మాణం చేసుకున్నాం. చాలా చాలా సంతోషం. భవనం కట్టుకోగానే అయిపోదు. ఇల్లు అలకగానే పండుగ కాదు. గిరిజన బిడ్డల సమస్యలు తీరవలసిన అవసరం ఉంది. కొంత కొంత ఒక్కో అడుగు పడుతుంది. చదువుకునే విషయంలో కానీ, విదేశాలకు వెళ్లే విషయంలో కానీ, గిరిజన పోడు భూముల విషయంలో కానీ, ఆదివాసీ బిడ్డల రక్షణ విషయంలో కానీ, కొద్దిగా మనం పురోగమిస్తున్నాం. ఇంకా మనకు చాలా సమస్యలు ఉన్నాయి. అవన్నీ కూడా పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది. ఈ భవనం యావత్ రాష్ట్రంలో ఉండేటటువంటి ఆదివాసీ బిడ్డల హక్కుల పరిరక్షణ వేదిక కావాలన్నారు. మంత్రులు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలు స్వప్నించినట్లుగానే అభివృద్ధి

- దేశంలో అంతర్భాగం అయ్యేనాటికే సొంత రాష్ట్రం
- ఆనాడే అభివృద్ధి దిశగా ప్రణాళికలతో ముందుకు
- ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం ఓ మలుపు
- అదే స్ఫూర్తితో అభివృద్ధిలోనూ దేశానికి ఆదర్శం
- జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల వేడుకల్లో సీఎం కేసీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** స్వాతంత్ర్యానికి పూర్వమే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారిన తర్వాత 1948 నుండి 1956 వరకు సొంతరాష్ట్రంగా వెలుగొందింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా హైదరాబాద్ రాష్ట్రం కొనసాగింది. మిగులు నిధులతో కూడిన నాటి హైదరాబాద్ రాష్ట్రం ఆనాడే అభివృద్ధి దిశగా ప్రణాళికలు నిర్మించుకొని, అడుగులు వేయటం ప్రారంభించిందని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా సీఎం కేసీఆర్ పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండా ఎగుర వేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజల్లో దేశం పట్ల విశ్వాసాన్ని నెలకొల్పడానికి నాటి భారత పాలకులు చేసిన కీలకమైన కృషి వల్ల నేడు మనం చూస్తున్న భారతదేశం ఆవిష్కృతమైందని సీఎం కేసీఆర్ తెలిపారు. మహాత్మాగాంధీ నెలకొల్పిన సామరస్య విలువలు భూమికగా, జవహర్ లాల్ నెహ్రూ కల్పించిన విశ్వాసం, సర్దార్ వల్లభభాయ్ పటేల్ ప్రదర్శించిన చాకచక్యం, మతాలకు అతీతంగా దేశభక్తి భావనను పాదుకొల్పిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి నేతలు చేసిన అవిరళ కృషి వల్ల ఒక్కొక్క చిక్కు ముడి వీడిపోయింది. భారతదేశం ఏకీకృతమైందని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏవిధంగానైతే ఉండాలని ప్రజలు స్వప్నించారో, సంభావించారో.. అదేవిధంగా నేడు తెలంగాణ అన్నిరంగాల్లోనూ అగ్రగామి రాష్ట్రంగా పురోగమిస్తున్నది. రాష్ట్రం ఏర్పడినినాడు ఆవరించి ఉన్న చిమ్మ చీకట్లను చీల్చుకుంటూ పురోగమించి.. దేశానికే దారిచూపే టార్చ్ బేరర్ గా నిలిచింది. విద్యుత్తు, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, ప్రజా సంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాలలో అనతికాలంలోనే అద్భుతాలను ఆవిష్కరించి దేశానికే దిశానిర్దేశనర చేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం అవలంబించిన ప్రగతిశీల, పారదర్శక విధానాల వల్ల రాష్ట్ర సంపద గణనీయంగా పెరిగిందని కేసీఆర్ తెలిపారు. 1956లో దేశంలో జరిగిన రాష్ట్రాల పునర్విభజన పక్రియలో భాగంగా.. తెలంగాణ ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా తెలంగాణ-ఆంధ్రలను కలిపి ఆంధప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి తెలంగాణ ప్రజలలో తాము మోసపోయినామనీ, తాము దోపిడీకి గురువుతున్నామనే ఆందోళన గూడు కట్టుకుంది. ఇరుప్రాంతాల మధ్య భావ సమైక్యత చోటు చేసుకోలేకపోగా సఖ్యత కూడా ఏర్పడలేదు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి తానే స్వయంగా సారథ్యం వహించి, ఉద్యమ శంఖం పూరించాను. తెలంగాణ ప్రజలందరినీ ఒక్కటిచేసి, పద్నాలుగేళ్లు అవిశ్రాంత పోరాటాన్ని నడిపించాను. లక్ష్య సాధన కోసం మరణం అంచులదాకా వెళ్లేందుకు సిద్ధపడ్డాను. తెలంగాణ ఉద్యమం అంతకంతకూ తీవ్రం కావడంతో ఢిల్లీ ప్రభుత్వం దిగివచ్చింది. ప్రజా ఉద్యమం ఆశించిన గమ్యాన్ని ముద్దాడింది. 2014 జూన్ 2న




తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది. 2013-14లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు రాష్ట్ర జీఎస్డీపీ 5 లక్షల 5 వేల 849 కోట్ల రూపాయలు కాగా, 2021-22 నాటికి 11 లక్షల 54 వేల 860 కోట్ల రూపాయలకు పెరిగింది. తలసరి ఆదాయం పెరుగుదలలోనూ తెలంగాణ రాష్ట్రం జాతీయ సగటును అధిగమించింది. 2014 -15 లో రాష్ట్ర తలసరి ఆదాయం 1 లక్షా 24 వేల 104 రూపాయలు కాగా, 2021-22 నాటికి 2 లక్షల 78 వేల 833 రూపాయలకు పెరిగింది. జాతీయ సగటు కన్నా మన రాష్ట్ర తలసరి ఆదాయం 86 శాతం అధికం కావడం మనందరికీ గర్వకారణం. సంపదను పెంచాలి.. పేదలకు పంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. అనేకరకాల సంక్షేమ పథకాల ద్వారా ఏటా 50 వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తున్నది. పేద, బలహీన వర్గాల ప్రజలకు జీవన భద్రతను కల్పిస్తున్నదని కేసీఆర్ తెలిపారు.















# భారత్‌లో విలీనమైన శుభ సందర్భం

- సెప్టెంబర్ 17కు ఉన్న ప్రత్యేకత అదే
- విచ్ఛిన్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జెండా ఆవిష్కరించి ప్రసంగించిన కెటిఆర్



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛ పొందడానికి ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని..ఆనాటి అపూర్వ ఘట్టాలు జాతి జీవనంలో నిరంతరం సజీవంగా నిలుస్తాయని ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ అన్నారు. సెప్టెంబర్ 17కు ప్రత్యేకత ఉందని, ఆనాడు హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యిందన్నారు. జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల కలెక్టరేట్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశంలో ప్రతిఘాతక శక్తులు రెచ్చిపోతున్నాయని.. మతతత్వ శక్తులు తెలంగాణలో అశాంతిని సృష్టించేందుకు కుట్ర చేస్తున్నాయని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. చిల్లర రాజకీయాలతో తెలంగాణ చరిత్రను వక్రీకరించి, మలినం చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. స్వరాష్ట్ర ఏర్పడ్డ ఎనిమిదేండ్ల లోనే తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా, సఫల రాష్ట్రంగా తీరిదిద్దామని కేటీఆర్ తెలిపారు. నాటికి నేటికీ తెలంగాణలో వచ్చిన మార్పులకు దేశం మొత్తం మనవైపే చూస్తుందన్నారు. మత పిచ్చి మంటల కోసం ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పచ్చని పంటలతో తెలంగాణ ముందుకు వెళ్తోందని, విద్వేష కర కుట్రలను తిప్పికొట్టాలని తెలిపారు. మనది వసుధైక కుటుంబమని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ సాకారం అయ్యాక ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఎనిమిదేళ్లలో తెలంగాణ జీవన ముఖచిత్రం ఎంతగానో మారిపోయిందని కేటీఆర్ తెలిపారు. పచ్చని పొలాలతో, చక్కని మౌలిక వసతులతో శాంతికి నెలవుగా తెలంగాణ అలరారుతున్నది. సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తూ రాష్ట్రం ప్రగతిబాటలో పయని స్తున్నది. ఈ తరుణంలో మతతత్వ శక్తులు తెలంగాణ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ పరిణామాలను గమనిస్తూ అప్రమత్తంగా ముందడుగు వేయాలని సూచించారు. కలెక్టర్, ఎస్పీ తదిరులు పాల్గొన్నారు.

## ఇన్నాళ్లూ సెప్టెంబర్ 17 గుర్తుకు రాలేదా



కెసిఆర్ తీరును తప్పుపట్టిన కోదండరామ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** సెప్టెంబర్ 17ను ఇన్నాళ్లు అధికారికంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్‌కు గుర్తుకు రాలేదా అని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజాస్వామిక స్ఫూర్తి అవలంబించాలని చెప్పారు. బీజేపీ నేతలు ఢిల్లీ నుంచి వచ్చి ఇక్కడ పెత్తనం చేయడం సరైంది కాదన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో కోదండరామ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను గుర్తించామని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతోనే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయిందన్నారు. భూస్వామ్య వ్యవస్థను అంతమొందించడంలో సోషలిష్టులు, కమ్యూనిస్టులు కీలక పాత్ర వహించారని కోదండరామ్ తెలిపారు.

## దప్పు కళాకారులకు పెరుగుతున్న ఆదరణ

పండగ ఏదైనా తీన్మార్ ఉండాల్సిందే

పొట్టకూటి కోసం పట్నాలకు వస్తున్న దరువుకారులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** వారు దరువేసి డప్పుపై తీన్మార్ వాయిస్తే.. ఒళ్లు పూనకం వచ్చినట్టు ఊగిపోవాల్సిందే... వారి డప్పు మోగిస్తే... ఎదురుగా ఉన్న ప్రతి మనిషి నాట్యం చేయాల్సిందే.... గ్రామీణ డప్పు కళాకారుల ప్రతిభ ఇప్పుడు పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీంతోపాటు ఎక్కడికి వెళ్లినా వారు తమకు ఉపాధి దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ డప్పు కళాకారులకు వివిధ సందర్భాల్లో పట్టణాలకు వచ్చి తమ సత్తా చాటుతున్నారు. దీంతో వారి ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. కార్యక్రమం లేదా పండగ లేదా జాతరేదైనా ఇప్పుడు వారు ముందుంటున్నారు. బోనాల జాతర,వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు ఇలా వివిధ రకాల పండుగలకు సంబంధించి గ్రామీణ డప్పు కళాకారులు బాగా ప్రాచుర్యం పొందారు. ఇటీవల వీరంతా గణనాథుల నిమజ్జనంలో భాగంగా జంటనగరాలతో పాటు పట్టణాల్లో సత్తా చాటారు. ఇలా డప్పు కళాకారులు గ్రామాల నుంచి బతుకు దెరువును వెతుక్కుంటూ పట్టణాలు, నగరాలకు తరలి వచ్చారు. నగరంలోని బ్యాండ్ వాయించే కళాకారులు ఎక్కువ మొత్తంలో పైకాన్ని వసూలు చేయడంతో ఉత్సవ నిర్వాహకుల దృష్టి గ్రామీణ కళాకారులపై పడింది. గ్రామీణ కళాకారులైతే తక్కువకు వస్తారని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు గ్రామీణ కళాకారుల వద్దకు వస్తున్నారు. ఇలా గత కొంత కాలంగా నిమజ్జన ఉత్సవాలకు హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలైన మెదక్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తీన్మార్ వాయించే డప్పుల కళాకారులు వస్తున్నారు. అదే కోవలో ఈ సంవత్సరం కూడా వివిధ జిల్లాల నుంచి బృందాలుగా ఏర్పడి వందలాది మంది వచ్చి సికింద్రాబాద్‌లోని జింఖానా పరేడ్ మైదానం గోడ పక్కన సేద తీరుతూ ఉపాధిని వెతుక్కుంటున్నారు. డప్పులు దరువేసి నాలుగు రూపాయలు సంపాదించవచ్చనే ఆశతో పని కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వందల కిలోమీటర్ల దూరం నుంచి వందలాది రూపాయల చార్జీలు పెట్టుకొని కళాకారులు కడుపు చేతబట్టుకొని ఎంతో ఆశతో నగరానికి వచ్చారు. ఈ తరుణంలో గ్రామీణ కళాకారులేగా అని చిన్న చూపు చూస్తూ వారి వద్దకు వచ్చి ఇష్టారాజ్యంగా కళాకారులకు ఒక్కరికి రూ.200 నుంచి రూ.500ల వరకు బేరమాడుతున్నారు. ఒక వేళ బేరం కుదిరినా.. పని పూర్తయ్యాక ఇస్తామన్న పైకం ఇవ్వకుండా ఉడాయిస్తున్నారు. కొందరు మాత్రమే ఆదరిస్తున్నారు.



## తెలంగాణ అమరులకు కెసిఆర్ అగౌరవం

కవిత ట్వీట్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

**నిజామాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** తెలంగాణ అమరవీరులను సీఎం కేసీఆర్ అగౌరవపరిచాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. విమోచన దినోత్సవంపై ఎమ్మెల్సీ కవిత చేసిన ట్వీట్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని గతంలో కవిత, కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని అర్వింద్ గుర్తు చేశారు. ఈ విషయంలో కేసీఆర్ కుటుంబ తీరు దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు చేయాల్సినవన్నీ చేస్తామని అర్వింద్ స్పష్టం చేశారు. కేంద్రం విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడంపై తెలంగాణ సమాజం హర్షిస్తోందని చెప్పారు. సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవమే తప్ప జాతీయ సమైక్యతా దినోత్సవం ఏ మాత్రం కాదని అర్వింద్ తేల్చి చెప్పారు. తెలంగాణలో ఆధికారంలోకి రావటానికి ఏం చేయాలో అన్నీ చేస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ...విమోచన దినోత్సవంపై ఎమ్మెల్సీ కవిత ట్వీట్స్‌ను ఎంపీ ఖండించారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని గతంలో కవిత కేటీఆర్‌లు లక్ష సార్లు డిమాండ్ చేశారని గుర్తుచేశారు. విమోచన దినోత్సవంపై కేసీఆర్ కుటుంబం తీరు దురదృష్ట కరమని అన్నారు. విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహించటంపై తెలంగాణ సమాజం హర్షిస్తోందని తెలిపారు. విమోచన దినోత్సవం మాత్రమే.. జాతీయ సమైక్య దినోత్సవం కాదని స్పష్టం చేశారు. అమరవీరులను సీఎం కేసీఆర్ అగౌరవపరిచారని ఎంపీ ధర్మపురి అరవింద్ మండిపడ్డారు.

## సాయుధ పోరాట చరిత్రను మార్చే కుట్ర

కులాలు,మతాలు మధ్య చిచ్చుకు యత్నాలు

వజ్రోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరించి,జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** కేంద్రం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మార్చే కుట్ర చేస్తోందని మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ లో మంత్రి జగదీశ్ రెడ్డి జాతీయ జండా ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో మంత్రితో పాటు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ... పోరాట యోధుల పట్ల కొందరు, గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే కుట్ర చేస్తున్నారన్న ఆయన.. తెలంగాణ ద్రోహుల కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. 2014 కు ముందు తెలంగాణలో ఆకలి చావులు, దరిద్రాలు తప్ప అభివృద్ధి లేకుండేనన్నారు. సరైన నాయకుడు లేక ప్రజలు అరగోస పడుతుండేనని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందన్న జగదీశ్ రెడ్డి... తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.

## నిజాంకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారు

మెదక్ జిల్లాలోనూ యోధులు ఉన్నారు

వజ్రోత్సవ వేడుకల్లో జెండా అవిష్కరించిన తలసాని



**మెదక్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు మెదక్ జిల్లాలో ఎంతో మంది ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. నిజం సర్కార్ ఆంక్షలను ధిక్కరించి ఆగస్టు 15న జాతీయ జెండాలను రెపరెపలాడించారని వెల్లడించారు. తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మెదక్ కలెక్టరేట్‌లో మంత్రి తలసాని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జాతీయ సమైక్యత ఉత్సవాల ప్రాధాన్యత ప్రజలు, విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దళితబంధు ద్వారా దళిత సమాజం అభ్యున్నతికి పాటుపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనునిత్యం కృషిచేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలోని సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని మంత్రి తలసాని చెప్పారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రైతుల కోసం రైతు బంధు, రైతుబీమా, ఆసరా పథకం ద్వారా అర్హులైన వారందరికీ పింఛన్లు, పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ ద్వారా లక్ష రూపాయలు, ÷షన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తు న్నామని వెల్లడించారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును తెలంగాణ సచివాలయానికి నామకరణం చేయడంతో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర ఉద్యమంలో మీ పాత్ర ఏమిటి

తెలంగాణ ఉద్యమంలోనూ మీరెక్కడ ?

ట్విట్టర్ వేదికగా అమిత్ షాకు కవిత ప్రశ్నలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** హైదరాబాద్ పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ నాయకులకు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పలు ప్రశ్నలు సంధించారు. స్వతంత్ర ఉద్యమంలో మీ పాత్ర ఏంటని అంటూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. హైదరాబాద్ సమైక్యత ఉద్యమంలో బీజేపీ పాత్ర ఏంటన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ మీ పాత్ర ఏంటని కవిత ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న అమిత్ షాతో బీజేపీ నేతలు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ బిడ్డగా, వీటి సమాధానాల కోసం ఎదురు చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రాలకు వచ్చి హామీలివ్వడం, ప్రజలు వారిని తిరస్కరించగానే, వంచించడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. దేశంలో ప్రజలకు తమ హక్కులు కలిపించడానికి బీజేపి చేసిందేమీ లేదన్నారు. సామరస్యం, ఏకత్వం, ప్రజా బలం.. ఇవే సీఎం కేసీఆర్‌కు, తెలంగాణకు పునాది అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వం కోసం ఎప్పుడూ పోరాటం చేసే సీఎం కేసీఆర్‌కు కవిత ప్రత్యేక

## 17న నే తెలంగాణ భారత్‌లో అంతర్భాగమైంది

వజ్రోత్సవేడుకల్లో జెండా ఆవిష్కరించిన మంత్రి నిరంజన్



**వనపర్తి, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఒక ప్రత్యేక విశిష్టత ఉన్నదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. 74 ఏండ్ల క్రితం ఇదే రోజున భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారిందని, రాజరిక పాలన నుంచి ప్రజాస్వామ్యదశలోకి పరివర్తన చెందిందన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల్లో భాగంగా వనపర్తిలోని ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఆగస్టులో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా జరుపుకున్నామని చెప్పారు. ప్రజలందరి గుండెల్లో దేశభక్తి భావన పెల్లుబికేలా 15 రోజులపాటు వైభవంగా జరుపుకున్నామని తెలిపారు. ఇప్పుడు మూడు రోజులపాటు తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నామని వెల్లడించారు.

## ట్విట్టర్ వేదికగా అమిత్‌షా పై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** హైదరాబాద్ పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు చురకలంటిస్తూ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. 74 ఏండ్ల క్రితం నాటి కేంద్ర హోంమంత్రి తెలంగాణ ప్రజలను ఇండియన్ యూనియన్‌లో కలిపేందుకు వచ్చారు. కానీ ఇవాళనేమో ప్రస్తుత కేంద్ర హోం మంత్రి తెలంగాణ ప్రజలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని విభజన చేసేందుకు హైదరాబాద్‌కు వచ్చారని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశానికి కావాల్సింది విభజన రాజకీయాలు కాదు.. నిర్ణయాత్మక రాజకీయాలు కావాలని తాను పదే పదే చెప్తున్నానని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రోజు ఓ కేంద్ర మంత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రజలను విభజించి బెదిరింపులకు పాల్పడేందుకు వచ్చారని ఆరోపించారు. అందుకే దేశానికి కావల్సింది నిర్ణయాత్మక విధానాలేనని, విభజన రాజకీయాలు కావని ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ పై అమిత్ షా పలు కామెంట్లు చేశారు. ఎన్నికల ప్రచారంలో.. ఉద్యమాల్లో హామీ ఇచ్చారని కానీ అమలు చేయలేదని పరోక్షంగా కేసీఆర్ సర్కార్‌ను విమర్శించారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలకు సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తుచేశారు. ఇన్నాళ్లు ఏ ప్రభుత్వం కూడా విమోచన దినోత్సవం నిర్వహించలేదని మండిపడ్డారు. విమోచన దినోత్సవం నిర్వహించేందుకు అన్ని పార్టీలు భయపడ్డాయని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తుందనే..వివిధ పేర్లతో కొందరు విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

## భారత్‌లో విలీనమైన హైదరాబాద్ సంస్థానం



అందుకే సెప్టెంబర్ 17కు ప్రాధాన్యం

స్వేచ్ఛకోసం ఎందరో పోరాటలు చేశారు

వజ్రోత్సవ వేడుకల్లో విప్ సునీతా మహేందర్ రెడ్డి

**భువనగిరి, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 చాలా కీలకమైన రోజని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. నేటితో ఈ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమై 74 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నదని వెల్లడించారు.ఆనాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది పలికిందని గొంగిడి సునీతా అన్నారు. ఈ స్వేచ్ఛ, స్వతంత్రం మన సొంతం కావడానికి ఎంతో మంది ఈ గడ్డమీద అసమాన త్యాగాలు చేశారని తెలిపారు. తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలలో భాగంగా భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె జాతీయ పతాకాని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. 1947, ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య సంబురాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్రానికై పోరాడుతూనే ఉన్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండగా మెజారిటీ సంస్థానాలు భారత దేశంలో విలీనమయ్యాయని, జునాఘడ్, కశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు మాత్రమే స్వతంత్రంగా ఉన్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుంది నాటి నిజాం ప్రకటించారని చెప్పారు. కానీ సంస్థానంలో ప్రజలకు కనీస మానవ హక్కులు లేవని, భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్లు, దేశ్‌ముఖ్‌లు ప్రజలను పీడించారని, ప్రైవేటు సైన్యం రజాకార్లు దమనకాండ కొనసాగిందన్నారు. రైతులు కౌలు కింద చేతికి అందిన పంటలో అగ్ర భాగం చెల్లించాల్సి వచ్చింది. 85 శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాష పై అణచివేత కొనసాగిందని వెల్లడించారు. కనీస హక్కులు కోసం, దోపిడీ, దౌర్జన్యాలు ఎదిరించిన ప్రజలపై దాడులు, అత్యాచారాలు, దారుణాలు ఎక్కువ కావడంతో ప్రజలు ఎదురు తిరిగారు. దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చినా తమకు స్వాతంత్యం÷-ర లేకపోవడాన్ని హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అప్పటికే రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ కోసమైన ఆయుధం అందుకోక తప్పదని ఆడ, మగ తేడా లేకుండా అన్నివర్గాల ప్రజలంతా సాయుధ పోరాటానికి సిద్ధమయ్యారు. పలుగు, పార, కారం, రోకలి, వరిసెల, బరిసేలు ఆయుధాలుగా మారాయి. ఈ పోరాటంలో నాలుగున్నరవేల మంది ప్రాణాలు కోల్పోయినా మడమతిప్పకుండా తెగువ చూపించారని తెలిపారు. నాటి పోరాటంలో తెలంగాణ మహిళలు కీలకపాత్ర పోషించడం విశేషమని చెప్పారు. ఆరుట్ల కమలాదేవి, చాకలి ఐలమ్మ, మల్లుస్వరాజ్యం లాంటి వారు సాయుధ పోరాటంలో తుపాకి చేతబట్టి పోరాటం చేశారు. నల్లగొండ జిల్లా ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. నిరంకుశత్వానికి, రజాకార్ల కిరాతక చర్యలకు ఎదురొడ్డిన ప్రాంతం చిట్యాల మండలం గుండ్రాంపల్లి, సూర్యాపేట మండలంలోని బాలెంల, ఇక వేములపల్లి మండలంలోని రావులపెంట కేంద్రంగా సాయుధ రైతాంగ పోరాటం సాగింది. నేటి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణ ఇచ్చింది ఆనాటి తరమేనని చెప్పారు.

## సిద్దిపేటలో ఘనంగా జాతీయసమైక్యతా వజ్రోత్సవాలు

తెలంగాణ స్వేచ్ఛకోసం సమాజం ఆవత్తూ పోరాడింది ● జెండా ఆవిష్కరించి ప్రసంగించిన మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట, సెప్టెంబర్ 17 (సమ సమాజం):** 74 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారిందని, రాచరిక పరిపాలన నుండి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందని మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకుంటు న్నామని తెలియజేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మంత్రి హరీష్ రావు జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. సిద్దిపేట జిల్లా ప్రజలందరికీ తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలనూ తెలంగాణ జాతి స్ఫూర్తిని ప్రతిబింబించెల మూడు రోజుల పాటు వైభవంగా జరపాలని హరీష్ రావు నిర్ణయించారు. గాంధీ నెలకొల్పిన సామరస్య విలువల వల్ల జవహర్ లాల్ నెహ్రూ కల్పించిన విశ్వాసం వల్ల మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాదుకొల్పిన మతాతీత దేశభక్తి భావనల వల్ల దేశానికి తొలి హోంమంత్రి అయిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ప్రదర్శించిన చాకచక్యం వల్ల సంస్థానాలు భారతదేశంలో కలిసిపోయి దేశం ఏకీకృత మైందని ప్రశంసిచారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని, ఆనాటి అపూర్వ ఘట్టాలు జాతి జీవనంలో నిరంతరం సజీవంగా నిలిచిపోయాయని కొనియాడారు. ఆ ఉజ్వల ఘట్టాలను, ఆనాటి యోధుల వెలకట్టలేని త్యాగాలను తలుచుకోవడం మనందరి బాధ్యతని హరీష్ రావు గుర్తు చేశారు. ఆదివాసీ యోధుడు కుమ్రం భీమ్ మొదలు షోయబుల్లాఖాన్ వంటి సాహితీమూర్తులకు ఘనమైన నివాళు లర్పిద్దామన్నారు. దేశం అనుసరిస్తున్న జీవన సూత్రం భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడడమే నిజమైన దేశభక్తి అన్నారు. 75 ఏళ్ళ స్వతంత్ర భారతంలో తెలంగాణ 60 సంవత్సరాల పాటు అస్తిత్వం కోసం ఉద్యమించిందని, కెసిఆర్ నేతృత్వంలో 14 ఏళ్ల పోరాటం చేశారని, అమరుల త్యాగ ఫలిత మని, 4కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చి నేడు స్వరాష్ట్రమై అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని ప్రశంసించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధి కోసం తలపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరోసారి నెమరువేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాలుగు దశాబ్దాల పైగా నాన్చివేతకు గురైన సిద్దిపేటకు జిల్లా హోదా దక్కడంతో పాటు పోలీస్ కమిషనరేట్ గా మారింది. కరువుతో తండ్లాడిన భూముల్లో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తెచ్చి పారిస్తున్నాము. మన జిల్లాలోని అన్నపూర్ణ, రంగనాయకసాగర్, శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి. గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా గోదావరి నీళ్లు మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నేలలను స్పృశించడం అద్భుత ఘట్టమనే చెప్పాలి.. ఒక్క పంటకు కూడా నోచుకోని భూముల్లో నేడు రెండు పంటలు పండుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే ఇది సాధ్యమైందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. రైతు ఆత్మ విశ్వాసం నింపేలా రైతు బందు, రైతు కుటుంబాలకు మనో ధైర్యం కల్పించేలా రైతు భీమా పథకాలను మన జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని హరీష్ రావు తెలిపారు. విద్యారంగంలో మన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉజ్వల ఘట్టాన్ని లిఖించారని అన్నారు. జిల్లాలోని 36 గురుకుల విద్యాలయాలు దాదాపు 15వేల మంది విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. సిద్దిపేట జిల్లా విద్యాక్షేత్రంగా అభివృద్ధి చెందుతున్నది. ఇప్పటికే హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్టు కళాశాల, ప్రభుత్వ మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల, నలువైపులా పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. త్వరలోనే వెటర్నరీ కళాశాల, ఫార్మసీ కళాశాల, లా కళాశాలు తెచ్చుకోబోతున్నామన్నారు.




# చలన చిత్రం




## లైగర్ పోయిందంటే..ఖుషీ షూటింగ్ ప్రాబ్లమ్స్

విజయ్ దేవరకొండ ఎన్నో అంచనాలు పెట్టుకున్న లైగర్ సినిమా బాక్సాఫీస్ వద్ద తలకిందులు అవ్వటంతో చాలా నిరాశ పడ్డాడు. కానీ, వెంటనే తేరుకొని.. తదుపరి సినిమా ఖుషి షూటింగ్ ప్రారంభించాడు. ఈ సినిమా చాలా వరకు షూటింగ్ కూడా పూర్తయింది.. కానీ ఈ సినిమాకి కూడా మళ్ళీ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇందులో నటిస్తున్న కథానాయిక సమంత కి ఏవో సమస్యలు రావటంతో ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఆగిపోయింది. ఆమె ఎప్పుడు వస్తుందా? అని విజయ్ మరియు ఇతర యూనిట్ సభ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. విషయం ఏంటంటే ఆమెకి ఇంతకు ముందు వచ్చినట్టుగా మొహానికి ఏదో స్కిన్ ప్రాబ్లమ్ వచ్చిందని, దానికి చికిత్స చేయించుకుంటోందని.. అందువల్ల ఆమె షూటింగ్‌కి రావటానికి చాలా టైం పడుతుందని అంటున్నారు. అసలే పాపం 'లైగర్' పోయి బాధలో వున్న విజయ్‌కి ఈ సినిమా చాలా లేట్ అవుతుందని తెలిసి, ఏమి చేయాలో పాలు పోవటం లేదట. ఈ సినిమాకి శివ నిర్వాణ దర్శకత్వం చేస్తున్నాడు. సమంత లేకుండా వున్న సీన్స్ అన్నీ విజయ్ దేవరకొండ ఈమధ్య షూటింగ్ పూర్తి చేసేశాడు కూడా. తన వంతు కృషి తాను చేస్తున్నాడు విజయ్. కానీ టైం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా మరి. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితిలో ఈ సినిమా వుందిప్పుడు. మైత్రీ మూవీ మేకర్స్ వాళ్ళు ఈ సినిమాని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## అబ్బ ఏమున్నాడ్రా..

### వరుణ్‌తేజ్ గెటప్స్‌పై కామెంట్స్



కెరీర్ మొదలైనప్పటి నుండి వైవిధ్యభరితమైన చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరో వరుణ్ తేజ్. హిట్స్ కోసం చూస్తున్నాడు. కొంతకాలంగా సరైన హిట్ మాత్రం పడటం లేదు. సినిమాలైతే చేస్తున్నాడు.. అందులో తను ఎంత కష్టపడాలో అంత కష్టపడుతున్నాడు.. కానీ హిట్ మాత్రం ఆయనకి ఈ మధ్య కాలంలో కష్టమవుతోంది. అందుకు కారణాలు అనేకం. రీసెంట్‌గా వచ్చిన 'ఎఫ్3' కూడా వరుణ్‌కు సరిపడా సక్సెస్‌ని ఇవ్వలేకపోయింది. అందుకే, ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో వరుణ్ తేజ్ ఉన్నట్లుగా.. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పిక్ చూస్తుంటే తెలుస్తోంది. ఈ పిక్‌లో వరుణ్ తేజ్‌ని చూసిన నెటిజన్లు.. 'అబ్బ.. ఏమున్నాడ్రా' అంటూ కామెంట్స్ చేస్తున్నారంటే.. ఆయన మేకోవర్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ లుక్ తన తదుపరి సినిమా కోసమో.. లేదంటే ఏదైనా బ్రాండ్ ప్రమోషన్ కోసమో తెలియదు కానీ.. రగ్డ్ అండ్ మాసివ్ లుక్‌లో వరుణ్ తేజ్ కత్తిలా ఉన్నాడనేలా అనిపించుకుంటున్నాడు. నిజంగా ఈ మేకోవర్‌తో ఆయన సినిమా చేస్తుంటే మాత్రం.. ముందు నుండే సినిమాపై భారీగా అంచనాలు పెరగడం ఖాయం. ప్రస్తుతం ఆయన 'చిత్రం ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కనుంది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవలే జరిగాయి. సెప్టెంబర్ 19న ప్రారంభోత్సవం జరుపుకోనుంది.



## చిరు సరసన శృతిహాసన్

హీరో చిరంజీవి తన 154వ సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. జీకే మోహన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. శృతి హాసన్ నాయికగా నటిస్తుండగా..ఇతర పాత్రల్లో రాజేందప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు కనిపించనున్నారు. మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. తాజాగా ఈ సినిమా గురించి ఒక అప్‌డేట్ చక్కర్లు కొడుతున్నది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల తేదీని ఖరారు చేసుకుందట. వచ్చే ఏడాది జనవరి 13న చిరంజీవి 154వ సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుందని సమాచారం. దీన్ని చిత్రబృందం ఖరారు చేయాల్సి ఉంది. ఆర్థర్ ఏ విల్సన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. ఇదిలా ఉంటే చిరంజీవి మరో కొత్త సినిమా 'గాడ్‌ఫాదర్' నుంచి సల్మాన్, చిరు చిందేసిన 'తార్ మార్ తక్కర్ మార్' లిరికల్ పాట ప్రోమో విడుదలై సోషల్ మీడియాలో సందడి చేస్తున్నది.

## బాలయ్య అన్‌స్టాపబుల్ ఆహా



నందమూరి నటసింహం 'బాలకృష్ణ' లోని మరో కోణం చూపించిన ప్రోగ్రాం 'అన్ స్టాపబుల్'. 'ఆహా' ఓటీటీలో బాలకృష్ణ హోస్ట్ గా టెలికాస్ట్ అయిన ఈ ప్రోగ్రాం అందరినీ ఆకట్టుకుంది. బాలయ్య చేసిన ఎంటర్ టైన్ మెంట్ అంతా ఇంతా కాదు. హోస్ట్ లతో సందడి సందడిగా మారిన ఈ కార్యక్రమం బాలయ్య అభిమానులనే కాకుండా ప్రేక్షకులను మెప్పించింది. అన్ స్టాపబుల్ సీజన్ 2 కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. సీజన్ 2 కమింగ్ సూన్ అంటూ అప్పట్లో ఆహా టీం పోస్టు చేసింది. కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. తాజాగా.. ఆహా క్లారిటీ ఇచ్చింది. త్వరలోనే అన్ స్టాపబుల్ సీజన్ 2 ప్రారంభం కాబోతోందని ట్వీట్ చేసింది. ఈ సంవత్సరంలోనే పండుగ త్వరలో ప్రారంభం కాబోతున్నట్లుగా ప్రకటించింది. 'దెబ్బకు థింకింగ్ మారిపోవాలా' అంటూ పేర్కొంది. బాలయ్య అభిమానులు ఫుల్ ఖుష్ అయిపోతున్నారు. ఈసారి ఎవరెవరు గెస్ట్‌లు గా వస్తారా అని ఆలోచిస్తున్నారు. అన్ స్టాపబుల్ 2 ప్రోగ్రాం మాత్రం కొత్తగా ఉంటుందని అందరూ అనుకుంటున్నారు. మరింత ఎంటర్టైన్ మెంట్ తో పాటు రికార్డ్స్ సృష్టించడం ఖాయమంటున్నారు. గతంలో జరిగిన అన్ స్టాపబుల్ మొదటి సీజన్ లో అఖండ టీం, బ్రహ్మానందం, మంచు ఫ్యామిలీ, మహేష్ బాబు, రాజమౌళితో పాటు పలువురు సెలబ్రెటీలు వచ్చి అలరించారు.



## బాలీవుడ్ ఆఫర్స్ దక్కించుకుంటున్న సామ్

దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్ నిర్మించుకున్న సమంత ఏళ్లపాటు అగ్రతారగా వెలిగింది. సౌత్‌లో స్టార్ హీరోలతో వరుస చిత్రాల్లో నటించింది. ఈ బిజీలో దక్షిణాది దాటి బయట అడుగుపెట్టలేదు. తీరిక లేక గతంలో వచ్చిన బాలీవుడ్ ప్రాజెక్ట్స్ కూడా చేయలేకపోయింది. 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'పుష్ప' సినిమాలు ఆమెకు బాలీవుడ్‌లోనూ పేరు తీసుకొచ్చాయి. ఇక్కడిలాగే అక్కడా అభిమానులను, పాపులారిటీని అందించాయి. దీంతో ఆమెకు కొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ క్యూ కడుతున్నాయి. హాలీవుడ్ డైరెక్టర్స్ రూసో బ్రదర్స్ చేసిన 'సిటాడెల్' హిందీ రీమేక్ ఇప్పటికే సెట్స్ మీద ఉండగా, తాజాగా మరో క్రేజీ మూవీ ఆఫర్ దక్కింది. దినేష్ విజన్ మ్యాడాక్ ఫిలింస్ సంస్థలో రాబోతున్న హారర్ కామెడీలో సమంత నాయికగా ఎంపికైంది. ఈ సంస్థ గతంలో 'స్త్రీ', 'బేడియా' వంటి విజయవంతమైన హారర్ చిత్రాలను నిర్మించింది. ఈ సినిమాలో ఆమె యువరాణి పాత్రలో

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in